క్లుప్తంగా

360 మందికి కంటి పరీక్షలు



వృద్ధుడికి కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

పెదపూడి: మండలంలోని కరకుదురులో వైఎస్సార్ సీపీ నేత వుండ్రు దొరబాబు జయంతి సందర్భంగా సర్పంచ్ వుండ్రు చంద్రకళ, హితకారిణి సమాజం డైరెక్టర్ వుండ్రు సత్యనారాయణలు గురువారం ఏర్పాటుచేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని కాకినాడ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(కుడా) చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళ దీప్తి ప్రారంభించారు. శిబిరంలో కంటి వైద్యనిపుణులు గీతా ప్రియ నేతృత్వంలో 360 మందికి కంటి పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాకినాడ కార్పొరేటర్ బన్నీ, మాజీ సర్పంచ్ సానా రాంబాబు, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి వాసంశెట్టి మాధవ, గ్రామ కన్వీనర్ పెమ్మనబోయిన గోవిందరాజు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీని సద్వినియోగం చేసుకోవాలి



కోటపాడు ఉపాధి గ్రామసభలో మాట్లాడుతున్న ఏపీఓ వెంకటేశ్వర్లు

రంగంపేట: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల ఉపాధి హామీ పథకం ఏపీఓ జి.వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం కోటపాడు సచివాలయంలో సర్పంచ్ గవరసాని లక్ష్మీదుర్గ అధ్యక్షతన జరిగిన గ్రామ సభకు ఆయన హాజరై మాట్లాడారు. అనంతరం ఉపాధి హామీ పథకం అమలులో భాగంగా 2024–25 ఆర్థిక సంవత్సరంలో చేపట్టబోయే పనుల గురించి చర్చించారు. కొత్తగా గుర్తించిన 52 పనులను వివరించారు. కార్యక్రమంలో కార్యదర్శి నిరీక్షణ, ఉపాధి సిబ్బంది, కూలీలు పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయుడికి స్మారక అవార్డు



గౌతమ్‌కృష్ణ మాస్టారిని సత్కరిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు రాంబాబు తదితరులు

రంగంపేట: మండలంలోని సింగంపల్లి మెయిన్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చేవూరి శ్రావణ్ గౌతమ్ కృష్ణకు లోలభట్టు చిన్నంరాజు స్మారక అవార్డును జెడ్పీటీసీ సభ్యుడు పేపకాయల రాంబాబు గురువారం అందజేశారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ సభ్యుడు రాంబాబు మాట్లాడుతూ గౌతమ్‌కృష్ణ మాస్టారు ఉపాధ్యాయులకు ఆదర్శప్రాయుడని కొనియాడారు. అనంతరం అవార్డు గ్రహీత గౌతమ్ కృష్ణను వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నల్లా శ్రీనివాసరావు, రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి రిమ్మలపూడి వెంకటేశ్వరరావు, సర్పంచ్ తుట్టా శివశంకర ఆనంద్, సీఆర్‌ఎంటీ శ్రీనివాసరాజు తదితరులు సత్కరించారు.

డీసీఎంఎస్ మెంబర్‌గా అమ్మిరెడ్డి



అమ్మిరెడ్డికి నియామకపత్రం అందజేస్తున్న డీసీఎంఎస్ చైర్‌పర్సన్ మణికుమారి

పెదపూడి: ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా సహకార మార్కెటింగ్ సంఘం (డీసీఎంఎస్) మెంబర్‌గా పెదపూడి మండలం పైన గ్రామ పీఏసీఎస్ చైర్మన్ సబ్బెళ్ల అమ్మిరెడ్డి కాకినాడలోని డీసీఎంఎస్ కార్యాలయంలో గురువారం ప్రమాణస్వీకారం చేసి బాధ్యతలు స్వీకరించారు. డీసీఎంఎస్ చైర్‌పర్సన్ సాకా మణికుమారి నియామక పత్రాన్ని ఆయనకు అందజేశారు. తనకు పదవి రావడానికి సహకరించిన ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు అభినందించారు.

చిరు వ్యాపారులపై భారం పెట్టొద్దు

గోకవరం: స్థానిక వారపు సంతపై ఆధారపడిన చిరు వ్యాపారస్తులపై భారం పెట్టొద్దని మాజీ ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. గోకవరంలో గురువారం ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. ఏజెన్సీకి ముఖద్వారంగా ఉన్న గోకవరం వారపు సంతకు శతాబ్దాల చరిత్ర ఉందన్నారు. ఈ సంతపై ఆధారపడి అనేక మంది తరతరాలుగా జీవిస్తున్నారని, వేలం పేరుతో వారి పొట్ట కొట్టవద్దన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మంగరౌతు రామకృష్ణ, కన్నబాబు, పాలూరి బోసుబాబు, బత్తుల సత్తిబాబు, పులపర్తి బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

కరెంటుకు కటకట లేకుండా..

- నిరంతరాయంగా విద్యుత్ సరఫరాకు చర్యలు
- కొత్తగా సబ్ స్టేషన్ల నిర్మాణం
- వ్యవసాయ రంగానికి ప్రత్యేక ఫీడర్లు

రాజానగరం నియోజకవర్గంలో సబ్ స్టేషన్లు	13
రాజానగరం మండలం	7
కోరుకొండ	3
సీతానగరం	3
మొత్తం వ్యవసాయ కనెక్షన్లు	9,890
నెలకు ఒక వ్యవసాయ కనెక్షన్ (1 హెచ్‌పీ - హార్స్‌పవర్ మోటార్)	
సగటు విద్యుత్ వినియోగం	250 - 300 యూనిట్లు



రాజానగరం మండలం రాధేయపాలెంలో పూర్తయిన సబ్ స్టేషన్ నిర్మాణం



నర్సాపురంలో జరుగుతున్న సబ్ స్టేషన్ నిర్మాణ పనులు

మధురపూడి: వ్యవసాయం దండగ కాదు.. పండగ కావాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పటిష్ట కార్యాచరణ చేపట్టారు. రైతును రాజును చేయాలనే దృక్పథంతో వివిధ పథకాలు అమలు చేస్తున్నారు. ఇందులో భాగంగా వ్యవసాయ రంగానికి నిరంతరాయంగా విద్యుత్ సరఫరా జరిగేలా చర్యలు తీసుకున్నారు. సీఎం జగన్ ఆదేశాల మేరకు విద్యుత్ అధికారులు అదనపు సబ్ స్టేషన్ల నిర్మాణం, ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటుతో పాటు లోడు తగ్గించేందుకు ఫీడర్లను విడదీస్తున్నారు. వచ్చే ఏడాది మార్చి నెల నాటికి వ్యవసాయ రంగానికి ప్రత్యేకంగా నిరంతరాయంగా విద్యుత్ సరఫరా జరిగేలా చర్యలు చేపట్టారు.

గతం దయనీయం.. నేడు ఘనం

గత ప్రభుత్వ హయాంలో వ్యవసాయ విద్యుత్ సరఫరా దయనీయంగా ఉండేది. కేవలం 7 గంటల పాటు, అది కూడా రెండు షిఫ్టులుగా పగలు, రాత్రి వేళల్లో సరఫరా చేసేవారు. అలాగే ప్రతి వ్యవసాయ కనెక్షన్‌కు 130 నుంచి 170 యూనిట్ల విద్యుత్ మాత్రమే సరఫరా జరిగేది. చాలీచాలని కరెంటు.. అది కూడా రెండు విడతలుగా ఇవ్వడంతో రైతులు ఇబ్బందులు పడేవారు. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించిన తరువాత ఈ పరిస్థితిని పూర్తిగా మార్చారు. రైతుల కష్టాలను గట్టెక్కించేందుకు ఒక్కో వ్యవసాయ విద్యుత్ కనెక్షన్‌కు నిరంతరాయంగా 9 గంటల పాటు 250 నుంచి 300 యూనిట్ల వరకూ విద్యుత్ సరఫరా చేస్తున్నారు.

కొత్తగా 3 సబ్ స్టేషన్ల నిర్మాణం

రాజానగరం నియోజకవర్గంలో 9,890 వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. రాజానగరం, కోరుకొండ, సీతానగరం మండలాల్లో మొత్తం 13 సబ్ స్టేషన్లు ఉన్నాయి. వీటి ద్వారా వ్యవసాయ రంగానికి నిరాటంకంగా 9 గంటల పాటు విద్యుత్ సరఫరా చేస్తున్నారు. సరఫరాలో లోపాలు లేకుండా చూసేందుకు మరికొన్ని సబ్ స్టేషన్లు నిర్మిస్తున్నారు. వీటిలో రాజానగరం మండలం రాధేయపాలెంలో సబ్ స్టేషన్ నిర్మాణం ఇప్పటికే పూర్తయ్యింది.

కోరుకొండ మండలం నర్సాపురం, సీతానగరం మండలం చినకొండేపూడిలో సబ్ స్టేషన్లు నిర్మాణ దశలో ఉన్నాయి. అలాగే, రానున్న వేసవిలో లో ఓల్టేజీ సమస్య తలెత్తకుండా, విద్యుత్ సరఫరా సక్రమంగా జరిగేందుకు వీలుగా అవసరమైన చోట్ల కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు కూడా ఏర్పాటు చేస్తున్నారు. మరోవైపు గ్రామీణ ప్రాంతంలోని చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు కూడా 3 ఫేజ్ విద్యుత్ సరఫరా చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. గృహ వినియోగదారులకు సరఫరా జరిగే ఫీడర్ ద్వారానే వ్యవసాయ విద్యుత్ సరఫరా కూడా జరుగుతూండటంతో లోడ్ అధికమై, ఇబ్బందులు ఎదురయ్యేవి. ఇప్పుడు ఈ ఫీడర్లను విడదీసి, వ్యవసాయ రంగానికి ప్రత్యేకంగా సరఫరా చేసేందుకు కార్యాచరణ చేపట్టారు.

మార్చి నాటికి..



వచ్చే ఏడాది మార్చి నెల నాటికి వ్యవసాయ రంగానికి నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేసేలా కార్యాచరణ చేపట్టాం. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు విద్యుత్ సరఫరాలో భద్రతకు ప్రాధాన్యం ఇస్తున్నాం. తద్వారా లైన్‌మన్లు, హెల్పర్లు ప్రమాదాలకు గురి కాకుండా చర్యలు తీసుకుంటున్నాం.

– దాట్ల శ్రీధర్‌వర్మ, ఈఈ, ఈపీడీసీఎల్

ఇది రైతు హిత ప్రభుత్వం



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం రైతుకు మేలు చేసేలా చర్యలు తీసుకుంటోంది. వ్యవసాయ రంగానికి ప్రాధాన్యం ఇవ్వడమే కాకుండా, రైతులకు మరింతగా ప్రోత్సాహాన్నిస్తోంది. మెరుగైన విద్యుత్ సరఫరాకు చర్యలు చేపట్టింది. వ్యవసాయ రంగానికి ప్రత్యేకంగా ఫీడర్లు ఏర్పాటు చేయడం అభినందనీయం.

– బాసా సత్యనారాయణ, రైతు నాయకుడు, గాదాల

రేపు మండల సమావేశం

గోకవరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం మండల సర్వ సభ్య సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ కె.పద్మజ్యోతి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ సుంకర శ్రీవల్లి అధ్యక్షతన ఉదయం 10.30 గంటలకు జరిగే ఈ సమావేశానికి ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

అమ్మవారికి భారీ సారె



అమ్మవారి సారెను ఊరేగిస్తున్న మహిళలు

సీతానగరం: దేవీ నవరాత్రుల సందర్భంగా సీతానగరం వెలమపేట రామాలయం వద్ద ఏర్పాటు చేసిన శ్రీ కనకదుర్గ అమ్మవారికి గురువారం 108 రకాల పిండివంటలతో భక్తులు భారీ సారె సమర్పించారు. ఈ వంటకాలను 250 బిందెల్లో ఉంచి ఉత్సవ కమిటీ ఆధ్వర్యాన మహిళలు ఊరేగింపు నిర్వహించారు. వెలమపేట నుంచి పోలీస్ స్టేషన్ మీదుగా బస్టాండ్ సెంటర్, నాలుగు బొమ్మల సెంటర్ నుంచి వెలమపేట రామాలయం వరకూ జరిగిన ఈ సారె ఊరేగింపు ప్రజలను ఆకట్టుకుంది. ఈ సందర్భంగా 50 మందికి పైగా భవానీ మాలధరణ చేసిన భక్తులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. శ్రీకనకదుర్గ అమ్మవారు శ్రీమహాచండీదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. సారె సమర్పించిన అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి సమర్పించిన సారెను గ్రామంలోని ప్రతి కుటుంబానికీ ప్రసాదంగా పంచిపెట్టారు. అమ్మవారికి ఆరుగురు దంపతులు రాత్రి 7 గంటల నుంచి పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

మళ్లీ ముఖ్యమంత్రిగా జగనే రావాలి

- ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి
- సంపరలో గడప గడపకూ మన ప్రభుత్వం



సంపరలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

పెదపూడి: ఇంటింటికీ సంక్షేమ పథకాలను అందజేస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డినే మళ్లీ ముఖ్యమంత్రిగా రావాలని ప్రజలందరూ కోరుకుంటున్నారని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. సంపరలో గురువారం ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి నాలుగున్నరేళ్లుగా ప్రభుత్వ సంక్షేమ పథకాలతో ఏ కుటుంబానికి ఎంత మేర లబ్ధి చేకూరిందో ఎమ్మెల్యే ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామంలో ఏ గడపకు వెళ్లిన మళ్లీ జగన్ ముఖ్యమంత్రి అయితేనే మా కుటుంబాలు మరింత అభివృద్ధి చెందుతాయని ప్రజలు చెబుతున్నారన్నారన్నారు. ముఖ్యమంత్రి జగనే మా కుటుంబాలకు ధైర్యం, మా పిల్లల భవిష్యత్‌కు భరోసా, రాష్ట్రాభివృద్ధికి దిక్సూచి అని కొనియాడుతున్నారన్నారు. రోజురోజుకూ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజాదరణ పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కేతా తులసి, జెడ్పీటీసీ సభ్యురాలు పేపకాయల వెంకటలక్ష్మి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి అద్దంకి ముక్తేశ్వరరావు, నాగిరెడ్డి వీరవెంకటసత్యనారాయణ, అద్దంకి భద్రం, తోట సాయి, రాయుడు సత్యవతి, సర్పంచుల సమాఖ్య అధ్యక్షుడు కోసూరి వాసు, పార్టీ మండల కన్వీనర్ గుత్తుల వెంకటరమణ, ఏపీత్రయం సొసైటీ చైర్మన్ గుండా ఈశ్వరరావు, వైస్ ఎంపీపీ కరెడ్ల వెంకన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

మహాచండీదేవిగా కనకదుర్గమ్మ



మహాచండీదేవి అలంకారంలో గోకవరం దేవీచౌక్ కనకదుర్గమ్మ



వీరభద్రునిగద్దెలో గాజుల అలంకారంలో కనకదుర్గమ్మ

గోకవరం: మండల వ్యాప్తంగా దేవీ శరన్నవరాత్ర ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఐదో రోజు గురువారం గోకవరం దేవీచౌక్ ఆలయంలో కనకదుర్గమ్మ మహాచండీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు వల్లూరి జగన్నాథశర్మ, శ్రీనివాస్‌శర్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. విశేష సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. వీరభద్రునిగద్దెలోని కనకదుర్గమ్మ సైతం మహాచండీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని ఆర్యవైశ్య మహిళా సంఘం సభ్యులు గాజులతో ప్రత్యేకంగా అలంకరించారు. దేవీ చౌక్, వీరభద్రునిగద్దె ఆలయాలను మాజీ ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ దర్శించుకున్నారు. స్థానిక వాసవీకన్యకాపరమేశ్వరి ఆలయంలో ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించారు. అమ్మవారికి 108 రకాల ప్రసాదాలను నివేదించారు.

వైభవంగా చండీ హోమం

అనపర్తి: దేవీ నవరాత్రులను పురస్కరించుకుని అనపర్తి గ్రామదేవత శ్రీ వీరుళ్లమ్మవారి ఆలయ ప్రాంగణంలో ఓంశక్తి సత్సంగం ఆధ్వర్యంలో కొలువుతీర్చిన త్రిశక్తి పీఠంలో గురువారం చండీ హోమం వైభవోపేతంగా నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, ఆదిలక్ష్మి దంపతులచే అర్చకులు అత్తిలి శివశర్మ శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలు జరిపించారు. కార్యక్రమంలో మిలట్రీరెడ్డి, మేడపాటి వెంకటరమణారెడ్డి, సత్తి రామారెడ్డి, మేడపాటి రామకృష్ణారెడ్డి, మేడపాటి శివశంకర్‌రెడ్డి, కర్రి వెంకటరెడ్డి, ఈడుపుగంటి మణికంఠ తదితరులు పాల్గొన్నారు.



చండీహోమంలో పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి దంపతులు



రంగంపేటలో లలితాదేవిగా దర్శనమిచ్చిన ఉమామహేశ్వరి అమ్మవారు

బిక్కవోలు: మండలంలోని పందలపాక వెలమపేట రామాలయం వద్ద కొలువైన శ్రీదేవి అమ్మవారి ఆలయం వద్ద భవానీలు పేటాతుళ్ల కార్యక్రమం గురువారం నిర్వహించారు. అనంతరం అమ్మవారి గ్రామోత్సవం చేశారు.

రంగంపేట: స్థానిక దేవీ సెంటర్‌లోని ఉమారామలింగేశ్వర ఆలయంలో ఉదయం అభిషేకాలు, కలశస్థాపన, సహస్ర నామ కుంకుమార్చన చేసి అమ్మవారిని లలితాదేవిగా అలంకరించారు. చంద్రేడులోని కాత్యాయనీ సమేత శ్రీచంద్రశేఖరస్వామి ఆలయంలో అమ్మవారిని లలితాదేవిగా అలంకరించారు.

పూడ్చివేసిన కాలువ పరిశీలన



అధికారుల బృందానికి పరిస్థితిని వివరిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు రాంబాబు

రంగంపేట: పూడ్చివేసిన చాగల్నాడు పంట కాలువను వ్యవసాయ శాఖ అధికారుల బృందం గురువారం పరిశీలించింది. రంగంపేట మండలంలోని పెదరాయవరం, గండేపల్లి మండలంలోని నాయకంపల్లి మధ్య చాగల్నాడు ఎత్తిపోతల పథకం కాలువను అర కిలోమీటర్ పొడవున పూడ్చి వేశారంటూ అనపర్తి ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, రంగంపేట ఎంపీపీ రిమ్మలపూడి శ్రీదేవి, జెడ్పీటీసీ సభ్యుడు పేపకాయల రాంబాబు మంగళవారం కాకినాడలో జరిగిన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా సర్వసభ్య సమావేశంలో ఫిర్యాదు చేసారు. దీంతో కలెక్టర్ కృతికాశుక్లా ఆదేశాలతో నిజనిర్ధారణ కోసం వ్యవసాయశాఖ జేడీ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం గురువారం పెదరాయవరం వచ్చి కాలువను పరిశీలించి రైతుల అభిప్రాయాలను సేకరించారు. కాలువ పూడ్చేయడం వల్ల దొడ్డిగుంట, కోటపాడు, మర్రిపూడి, గ్రామాలకు నష్టం జరుగుతుందని రైతు నాయకులు అడబాల వెంకటేశ్వరరావు, సుంకర అప్పారావు, పుట్టా సోమన్న చౌదరి వివరించారు. వెంకటాపురం, సింగంపల్లి గ్రామాలకు కూడా నీరు అందడం లేదని జెడ్పీటీసీ సభ్యుడు పేపకాయల రాంబాబు తెలిపారు. కాలువ పునరుద్ధరణకు సిఫార్సు చేస్తామని అధికారులు రైతులకు హామీ ఇచ్చారు.

రోజారాణికి సత్కారం



రోజారాణిని సత్కరిస్తున్న వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నల్లా శ్రీనివాసరావు

రంగంపేట: డీఈడీ పరీక్షలో ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణురాలైన అంధురాలు రోజారాణిని ఘనంగా సత్కరించారు. గురువారం సింగపల్లిలో ఏర్పాటుచేసిన అభినందనసభకు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నల్లా శ్రీనివాసరావు హాజరై రోజారాణి అంధత్వాన్ని లెక్కచేయకుండా విద్యాభ్యాసంలో అన్నింటా అగ్రగామిగా నిలవడం అభినందనీయమన్నారు. ఆమె ఆత్మబలంతో మరిన్ని అద్భుత విజయాలు సాధించి గ్రామానికి మంచిపేరు తీసుకురావాలన్నారు. ఈ సందర్భంగా చంద్రేడు ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు గరిమెల్ల అరుణ, ఆమె సోదరి కమల, సీఆర్‌ఎంటీ ఎల్.శ్రీనివాసరాజులు సమకూర్చిన రూ.3 వేల నగదు, జ్ఞాపికలను రోజారాణికి అందించి సత్కరించారు. సత్కారగ్రహీత రోజారాణి కృతజ్ఞతలు తెలుపుతూ ఉపాధ్యాయరాలిగా ఉద్యోగం సాధించడమే తన లక్ష్యమన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ తుట్టా శివశంకర్ ఆనంద్, గ్రామస్తులు పాల్గొన్నారు.

నవదుర్గలుగా చిన్నారులు



నవదుర్గలుగా అలరించిన చిన్నారులు

రాజానగరం: దసరా ఉత్సవాల్లో భాగంగా గురువారం చక్రద్వారబంధం దేవీచౌక్‌లో నవదుర్గలకు ప్రతిరూపాలుగా తొమ్మిది మంది చిన్నారులను అలంకరించి, ప్రత్యేక పూజలు చేయించారు. బలభద్ర సుబ్రహ్మణ్య ప్రసాద్ దంపతులతో అర్చకుడు శ్రీకాంత్‌శర్మ ఆధ్వర్యాన ఈ కార్యక్రమం కన్నుల పండువగా జరిగింది.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

రాజానగరం: దివాన్‌చెరువు 33/11 కేవీ సబ్ స్టేషన్ పరిధిలో నిర్వహణాపరమైన పనుల కోసం శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుంది. ఆ సమయంలో దివాన్ చెరువు, పాలచర్ల, శ్రీరామపురం గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఏపీ ఈపీడీసీఎల్ ఈఈ దాట్ల శ్రీధర్‌వర్మ తెలిపారు.

విద్యుదాఘాతంతో గాయాలు

మధురపూడి: విద్యుదాఘాతంతో ఓ యువకుడు గాయపడ్డాడు. స్థానికుల కథనం ప్రకారం.. కోరుకొండకు చెందిన కొచ్చెర్ల వరప్రసాద్ ఇంటిపై భాగంలో పనులు చేస్తూ జీవనం సాగిస్తాడు, అదేవిధంగా గురువారం కూలీ పనికి వెళ్లిన అతడు నిచ్చెనతో షెడ్డు ఎక్కుతున్నాడు. అదే సమయంలో అక్కడే ఉన్న 33 కేవీ లైన్ తగలడంతో ఒక్కసారిగా షాక్‌కు గురై, కింద పడి గాయపడ్డాడు. 108 సిబ్బంది సకాలంలో ఆసుపత్రికి తరలించడంతో వరప్రసాద్‌కు ప్రాణాపాయం తప్పింది.

సురక్షతో మెరుగైన వైద్య సేవలు

గ్రామాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు



సింగంపల్లి జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యుడు రాంబాబు



కొంకుదురులో జగనన్న సురక్ష శిబిరంలో వైద్య సేవలను పరిశీలిస్తున్న ప్రజాప్రతినిధులు



ఇనుగంటివారిపేట వైద్య శిబిరంలో మందులు పంపిణీ చేస్తున్న వైద్య సిబ్బంది, నాయకులు



కాపవరం జగనన్న ఆరోగ్య సురక్షలో రోగులకు సేవలందిస్తున్న వైద్యులు

రంగంపేట: జగనన్న ఆరోగ్య సురక్షతో పేదలకు మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయని జెడ్పీటీసీ సభ్యుడు పేపకాయల రాంబాబు అన్నారు. మండలంలోని సింగంపల్లి గ్రామంలో గురువారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. శిబిరంలో 577 మందికి వైద్య సేవలందించి అవసరమైనవారికి మందులు ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నల్లా శ్రీనివాసరావు, రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి రిమ్మలపూడి వెంకటేశ్వరరావు, సర్పంచ్ తుల్లా శివశంకర్ ఆనంద్, ఉప సర్పంచ్ సోమిశెట్టి అప్పారావు, పీహెచ్‌సీ డాక్టర్ జి.రామ్‌భాస్కర్ పాల్గొన్నారు.

పెదపూడి: ప్రజలకు సంపూర్ణ ఆరోగ్యం అందించాలని ప్రభుత్వం ప్రత్యేకంగా నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ కేతా తులసి, ఎంపీడీఓ పి.విజయభాస్కర్ తెలిపారు. జి.మామిడాడలోని సచివాలయం–3లో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం సర్పంచిలంక మున్ని అధ్యక్షతన గురువారం నిర్వహించారు. శిబిరంలో 554 మందికి వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ టి.సుభాష్, ఉప సర్పంచ్ మేడపాటి తాతారెడ్డి, సచివాలయ కార్యదర్శి సాయిమనోజ్, కడిమి శ్రీను, సబ్బెళ్ల మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

బిక్కవోలు: వైద్య రంగానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తుందని జెడ్పీటీసీ రొంగల పద్మావతి అన్నారు. గురువారం మండలంలోని కొంకుదురులో జగనన్న సురక్ష కార్యక్రమం గురువారం నిర్వహించారు. శిబిరంలో సుమారు 500 మందికి వైద్య పరీక్షలు చేసి అవసరమైనవారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సత్తి వీరమణి, ఎంపీటీసీ కొంకుదురు పీవీ, సొసైటీ అధ్యక్షుడు సత్తి నాగిరెడ్డి రాజా, వైఎస్సార్ సీపీ నియోజకవర్గం ప్రచార కమిటీ అధ్యక్షుడు రొంగల అప్పాజీ, వైద్యులు జి.విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఇనుగంటివారిపేటలో 731 మందికి వైద్య సేవలు

సీతానగరం: ఇనుగంటివారిపేట శ్రీ ద్వారకామాయి ఫంక్షన్ హాలులో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో 731 మందికి వైద్య సేవలు అందించారు. రోగులకు పీహెచ్‌సీ వైద్యులు రాజు, ఏసురాణి, స్పెషలిస్టు వైద్యులు జి.రంజిత (జనరల్ సర్జన్), కె.రఘు (కీళ్ల వ్యాధి నిపుణులు), బి.సత్య ప్రసాద్ (కంటి వైద్య నిపుణులు) వైద్య సేవలు అందించారు. 25 మందికి ఈసీజీ తీశారు. 575 మందికి వివిధ వైద్య పరీక్షలు చేశారు. 30 మందిని ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రులకు రిఫర్ చేశారు. 117 మందికి కంటి పరీక్షలు చేసి, 99 మందికి కళ్లజోళ్లు అవసరమని గుర్తించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వీటిని ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న, వైస్ ఎంపీపీ–2 సత్యం మదన్‌బాబు, సర్పంచ్ సత్యం రాంపండు, వైఎస్సార్ సీపీ మండల కో కన్వీనర్ కరుటూరి శ్రీహరిబాబు చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఐసీడీఎస్ ఆధ్వర్యాన పౌష్టికాహార వంటల స్టాల్ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఈవీ శ్రీజ, వైద్య సిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

కాపవరంలో..

మధురపూడి: కోరుకొండ మండలం కాపవరం సచివాలయం వద్ద నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో 650 మందికి వైద్య సేవలు అందించారు.

అవసరమైన వారిని జీజీహెచ్, కార్పొరేట్ ఆసుపత్రులకు రిఫర్ చేశారు. రోగులను కోరుకొండ పీహెచ్‌సీ వైద్యులు రవిచంద్ర, శ్రీవల్లి, లాస్య, పార్థసారథి పరీక్షించి, ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పీఎస్ నరేష్‌కుమార్, సర్పంచ్ జాజుల రాము, సచివాలయ సెక్రటరీ అన్వర్ ఉల్ హక్ పాల్గొన్నారు.

రంగవల్లుల పోటీలు

రాజానగరం: దివాన్ చెరువు పాతూరులోని రైస్ మిల్లు వీధిలో శరన్నవరాత్ర ఉత్సవాలు, కనకదుర్గ ఉత్సవ కమిటీ 20వ వార్షికోత్సవంలో భాగంగా మహిళలకు గురువారం రంగవల్లుల పోటీలు నిర్వహించారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను కొల్లూరి సంధ్య, వంక భార్గవి, పలివెల సౌజన్య గెలుచుకున్నారు. ఈ పోటీలకు న్యాయనిర్ణేతలుగా పి.శైలజ, విజయకుమారి వ్యవహరించారు.



పోటీలో వేసిన రంగవల్లులు